క్లుప్తంగా

వైభవంగా బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



అంకురార్పణకు పూజా సామగ్రి తీసుకెళ్తున్న అర్చకులు, టీటీడీ అధికారులు

కలికిరి(వాల్మీకిపురం): వాల్మీకిపురం పట్టాభి రాముడి బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా బుధవారం సాయంత్రం అంకురార్పణ కార్యక్రమాలు వైభవంగా ప్రారంభించారు. ఉదయం సుప్రభాతసేవ, మూలవర్లకు అభిషేకం, సర్వదర్శనం, సాయంత్రం స్వస్తి పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, రక్షాబంధనం, సేనాధిపతి ఉత్సవం, కలశస్థాపన చేసి అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం గజవాహన సేవతో ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలు 9 రోజుల పాటు టీటీడీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్మికులు

మదనపల్లె సిటీ: చాలిచాలనీ జీతాలతో బతుకుతున్నామని, తమకు ఉద్యోగభద్రత కల్పించి ఆదుకోవాలని ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం బసినికొండ పంచాయతీ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ గౌరవ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పంచాయతీల్లో 25 సంవత్సరాలుగా కార్మికులుగా పని చేస్తున్నా ఇప్పటి వరకు చాలీచాలనీ జీతాలతో అవస్థలు పడుతున్నారన్నారు. జీతాలు కూడా ప్రతి నెలా సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. పని చేసేందుకు పనిముట్లు సరిగా ఇవ్వడం లేదని, సెలవులు అమలు చేయడం లేదని తెలిపారు. అనంతరం డీఎల్‌పీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు, రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రమీలమ్మ, జిల్లా కమిటీ సభ్యులు గోపాల్,రవి, నాగరాజు, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కలికిరి (వాల్మీకిపురం): వాల్మీకిపురంలోని మైనార్టీ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమామంజుల తెలిపారు. ఈ నెల 6వ తేదీ వరకు ఆన్‌లైన్ వెబ్‌సైట్ ఏపీఆర్ఎస్. ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్‌లో దరఖాస్తు పూర్తి చేయాలని, దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 25న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మైనార్టీ బాలికలు దరఖాస్తుకు అర్హులన్నారు. ఎంపీసీ విభాగంలో (40), బైపీసీ (40), సీఈసీ (35) సీట్లు ఉన్నాయని, కళాశాలలో ఉర్దూ, ఆంగ్ల మాధ్యమాలలో బోధన ఉంటుందని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన మైనార్టీ విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ప్రిన్సిపాల్ మొబైల్ 8712625077, ప్రవేశ పరీక్ష కో–ఆర్డినేటర్ 8712625076 నంబర్లను కళాశాల పనివేళల్లో సంప్రదించాలని ఆమె కోరారు.

6న సాయిబాబా ఆలయంలో పూజలు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం కోటవీధిలోని శ్రీ షిర్డిసాయిబాబా ఆలయంలో ఈనెల 6వ తేదీన సాయిబాబా జన్మదినం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు సాయిచక్రవర్తి తెలిపారు. ఉదయం విశేష అభిషేక పూజలు, హోమాలు జరుగుతాయన్నారు. భక్తులు బాబాను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

సన్మానం



సుదర్శనంను సన్మానిస్తున్న మాల మహానాడు నాయకులు

నిమ్మనపల్లె: అంబేద్కర్ సేవా అవార్డు గ్రహీత మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ యముల సుదర్శన్‌ను మాల మహానాడు రాష్ట్ర నాయకులు చంద్రయ్య, మండలాధ్యక్షుడు వీరనాల మాణిక్యం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సుదర్శనం మాట్లాడుతూ దళితుల సమస్యల పైన సుదీర్ఘ పోరాటాలు చేయడంతో నేడు రిపబ్లిక్ పార్టీ గుర్తించి తనకు ఉగాది పండుగ సందర్భంగా అంబేద్కర్ సేవా అవార్డు పొందడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు గుండా మనోహర్, అధికార ప్రతినిధి మల్లెల మోహన్, జిల్లా నాయకులు వీరనాల మాణిక్యం, స్థానిక నాయకులు శ్రీరాములు, జగదీష్ ,ఎర్రయ్య ,సుధాకర్, నాగరాజు, రమణ, భరత్, నవీన్, అప్పయ్య, కృష్ణమూర్తి శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

285 ఫారం పాండ్ల మంజూరు

చిన్నమండెం : మండలంలో 285 ఫారం పాండ్ల పనులు పూర్తి చేసేలా కృషి చేయాలని ఎంపీడీఓ శివానాయక్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

వినూత్న ఆలోచన.. పంటకు రక్షణ

రైతు వ్యవసాయం చేయాలంటే ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కోవాలి. పొలంలో విత్తు విత్తింది మొదలు పంట దిగుబడి చేతికొచ్చే వరకూ రేయింబవళ్లు కంటికి రెప్పలా సంరక్షించాలి. వేలకు వేలు పోసి రైతు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను ఒక వైపు అతివృష్టి, అనావృష్టి, చీడ పీడలు పంట దిగుబడిపై ప్రభావం చూపుతుంటే.. మరోవైపు ఆ పంటపై జంతువులు, పక్షుల బెడద గోరు చుట్టుపై రోకలి పోటులా మారాయి. ఈ పరిస్థితుల్లో రైతులు ఎవరికి తోచిన విధంగా వారు పంట సంరక్షణ కోసం పలు వినూత్న ఆలోచనలు చేస్తున్నారు.

- పొలం చుట్టూ విద్యుత్ లైట్లు
- ఎఫ్ఎమ్ రేడియోలు, స్పీకర్ల ఏర్పాటు
- అడవిజంతువుల బెడదతో రైతులకు పాట్లు



పొలం వద్ద విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసిన రైతులు

గుర్రంకొండ: పంట రక్షణకు రైతుకు నానా తిప్పలు పడుతున్నారు. వానరాలు, అడవి జంతువులు, క్రిమికీటకాల నుంచి కాపాడుకోవాల్సి ఉంటుంది. వీటికి చెక్ పెట్టేందుకు అన్నదాత వినూత్నంగా ఆలోచిస్తున్నాడు. పొలం చుట్టూ విద్యుత్ లైట్లను రాత్రిళ్లు ఏర్పాటు చేసుకొంటున్నారు. మరికొన్ని చోట్ల పొలాల్లో ఎఫ్ఎమ్ రేడియోలు, స్పీకర్లతో అడవి జంతువులను హడలెత్తిస్తున్నారు. ఇలాంటి పద్ధతులు మంచి ఫలితాలు ఇస్తున్నాయని రైతులు చెబుతున్నారు.

పొలాల్లో విద్యుత్ కాంతులు

రబీ సీజన్‌లో రైతులు పలు గ్రామాల్లో వేరుశనగ సాగు చేశారు. అయితే అడవి జంతువుల బెడద అన్నదాత కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. దీంతో వీటి బారినుండి పంటను కాపాడుకునేందుకు కొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టారు. వేరుశనగ పంట చుట్టూ స్తంభాలు ఏర్పాటు చేసుకొని విద్యుత్ లైట్లు అమర్చుతున్నారు. లైట్ల వెలుతురుకు అడవి జంతువులు అటు వైపు వెళ్లడం లేదు.

ఎఫ్ఎమ్ రేడియోలు ఏర్పాటు

కొంతమంది రైతులు కర్బూజాతో పాటు మరికొన్ని పంటల వద్ద అడవి జంతువుల నుంచి పంటలను కాపాడుకోవడానికి చెట్లకు పందిళ్లకు ఎఫ్ఎమ్ రేడియోలు ఏర్పాటు చేసుకొంటున్నారు.

అలాగే చిన్న, చిన్న మైకులు పెడుతున్నారు. ఎకరానికి నాలుగు మూలల నాలుగు మైకులు పెడుతున్నారు. ఈ మైకులో ముందే వాయిస్ రికార్డింగ్ చేసి దాన్నే పదే పదే వినిపించేటట్లు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో పొలంలో నిత్యం మనుషులు సంచరిస్తున్న భావన కనిపించేటట్లు చేస్తున్నారు. పక్షులతో పాటు అడవి జంతువులు పంటను కాపాడుకుంటున్నారు. ఖర్చు తక్కువగా ఉండటంతో పాటు పంటను కాపాడుకునేందుకు ఈ మార్గం సౌలభ్యంగా ఉన్నట్లు రైతులు చెబుతున్నారు.



ఎఫ్ఎమ్ రేడియోలు ఏర్పాటు చేసిన దృశ్యం

బాధితులకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



శ్రీరాములుకు ఆర్థిక సహాయం అందిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

ములకలచెరువు /తంబళ్లపల్లె: బాధితులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి భరోసా ఇచ్చారు. ములకలచెరువు మండలం పర్తికోటకు చెందిన గొర్రెల పెంపకం రైతు శ్రీరాములు వాటిని మేపుకునేందుకు మంగళవారం గుట్టలోకి వెళ్లగా అగ్నిప్రమాదానికి గురై 60 గొర్రెలు కాలి మృత్యువాత పడ్డాయి. దీంతో శ్రీరాములు కుటుంబం ఆధారం కోల్పోయింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పర్తికోటకు వెళ్లి బాధితుడు శ్రీరాములును పరామర్శించి ధైర్యం చెప్పారు. తన సొంత సొమ్ము రూ.60 వేలు అందించారు. ఆదుకునేందుకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. బాధితునికి ధైర్యం చెప్పారు. అలాగే తంబళ్లపల్లె మండలం చేలూరి వాండ్లపల్లెకు చెందిన తూగు మద్దిరెడ్డి, రఘునాథరెడ్డిలకు చెందిన మూడు గడ్డివాములు అగ్నిప్రమాదానికి గురై కాలిపోయాయి. ఈ గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే బాధితున్ని పరామర్శించి మద్దిరెడ్డికి రూ.25 వేలు, రఘునాథరెడ్డికి రూ.5వేలు ఆర్థిక సహాయం అందించారు. రాజకీయాలతో సంబంధం లేకుండా బాధితులను ఆదుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ కరీం, మండల కన్వీనర్ చౌడేశ్వర, నర్సరీ శివ, జయనారాయణరెడ్డి, బాలకృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, కులదీప్ రెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న ఎస్‌ఎంయూ నాయకులు

పీలేరురూరల్ : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎంయూ జిల్లా కార్యదర్శి పి.ఎం.ఎస్. రాజు అన్నారు. బుధవారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రెండు రోజుల పాటు ఎస్‌ఎంయూ నాయకులు రెడ్ బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 2019 సర్క్యులర్‌ను ఖచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. నైట్‌అవుట్ అలవెన్సులు రూ. 400 ఇవ్వాలని కోరారు. హైయర్ పెన్షన్ సమస్యలు సత్వరం పరిష్కరించాలని, లీవు ఎన్‌క్యాష్‌మెంట్‌ను వెంటనే మంజూరు చేయాలన్నారు. ఎలక్ట్రానిక్ బస్సులను ప్రభుత్వం, సంస్థ గానీ కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈహెచ్ఎస్ విధానంకు బదులు పాత వైద్యవిధానం అమలు చేయాలని కోరారు. ఎస్ఎంయూ నాయకులు సి.వి. రమణ, ఆదినారాయణ, హరినాథ, రఘు పాల్గొన్నారు.

నిత్యం కార్యకర్తలతోనే ఉంటా

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



నాయకులు, కార్యకర్తలతో కలిసి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి: నిత్యం కార్యకర్తలతో ఉంటానని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం కలికిరి, వాల్మీకిపురం మండలాల పరిధిలోని పలు కార్యక్రమాలల్లో పాల్గొన్న ఆయన స్థానిక నాయకులు, కార్యకర్తలను కలుసుకున్నారు. మండలంలోని మొర్రంకిందపల్లి గ్రామం అరవవాండ్లపల్లికి చెందిన సురేంద్రరెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్న సమాచారంతో వారి ఇంటికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. కలికిరి పట్టణం బీడీ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్త భానుప్రకాష్ నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్యకర్తలకు ఏలాంటి సమయంలోనైనా అండగా ఉంటానన్నారు. కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ఇప్పటికే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, ప్రభుత్వం తీరుపై పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, మండల పార్టీ కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ అరుణబాబురెడ్డి, ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్టీడి హరి, ఎంబ హనీఫ్, వెంకటపతి, మహేంద్రరెడ్డి, మల్లికార్జున, నరేష్, ఖాదర్‌వల్లి, బావాజీ, విశ్వనాథ, శామ్యూల్, భాను, సహదేవ పాల్గొన్నారు.

పరామర్శ

వాల్మీకిపురం మండలం చింతపర్తి గ్రామం మేకలవాండ్లపల్లికి చెందిన వైస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ నల్లంకి నరసింహులు రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. అలాగే చారావాండ్లపల్లికి చెందిన చింతల రెడ్డెప్పరెడ్డి దశదిన కార్యక్రమానికి హాజరై ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

జాగ్రత్తలతోనే వడదెబ్బకు దూరం



వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు

మదనపల్లె సిటీ: జాగ్రత్తలు తీసుకుంటే వడదెబ్బకు గురికాకుండా చూసుకోవచ్చని ఆరోగ్య వైద్యాధికారి మహమ్మద్‌రఫీ అన్నారు. బుధవారం మదనపల్లె అర్బన్ పరిధిలోని నీరుగట్టువారిపల్లె సచివాలయ పరిధిలోని గజ్జలకుంట, అప్పారావువీధి, అప్పారావుతోట ప్రజలకు వడదెబ్బ, డ్రైడేపై అవగాహన కల్పించారు. వేసవి కాలంలో ఆరుబయట నిద్రించడం, గాలి కొరకు తలుపులు, కిటికీలు తెరచి ఉండచం వల్ల దోమలు ఇళ్లలోని చేరి జ్వరాలు ప్రబలుతాయన్నారు. ప్రజలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. రైతులు ఉదయం ఆరు నుంచి పదకొండు గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటలపనైన మాత్రమే పని చేయాలని సూచించారు. అనంతరం ర్యాలీ చేశారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి ఖలీలుల్లాఖాన్, శానిటరీ కార్యదర్శులు రెడ్డప్ప,బాలాజీ, మహమ్మద్ జిలానీ పాల్గొన్నారు.

బీజేపీ మండల కమిటీ ఎన్నిక

నిమ్మనపల్లె: భారతీయ జనతా పార్టీ మండల నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు రెడ్డివారి సునీల్ రెడ్డి తెలిపారు. ఉపాధ్యక్షులుగా మదనమోహన్ రెడ్డి, బాలే శ్రీరాములు, కంటి సురేష్, మేకల శ్యామల, జ్ఞానేశ్వరి, ప్రధాన కార్యదర్శులుగా బురుసు నాగరాజా, చిన్న రెడ్డప్ప, కార్యదర్శులుగా గుండ్ల వెంకటరమణ, ఆసాది రామమూర్తి, బోడిమల్ల శివయ్య, దేవర కేశవ, నాగలక్ష్మి, దివ్యశ్రీ, కడపల శ్రీనివాసులు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని తెలిపారు.

నీటి తొట్లు మంజూరు

రామాపురం : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో మండలంలోని 13 గ్రామ పంచాయతీలలో పశువులకు దాహార్తించడానికి 39 నీటి తొట్లు మంజూరైట్లు ఉపాధి హామీ పథకం ఏపీఓ పెంచలయ్య తెలిపారు.

ఆటిజం.. అవగాహన అవసరం



ర్యాలీ చేస్తున్న ఎంఈఓ నారాయణ, భవిత కేంద్రం సిబ్బంది

నిమ్మనపల్లె : సామాజిక సూచనలను అర్థం చేసుకోవడంలో ఇబ్బందులు పడుతున్న (ఆటిజం వైకల్యం) పిల్లలను గుర్తించి వారిని ప్రత్యేకంగా తీర్చిదిద్దడానికి భవిత కేంద్రం సిబ్బంది చర్యలు చేపడుతోందని ఎంఈఓలు పద్మావతి, నారాయణలు తెలిపారు. బుధవారం ఆటిజం వైకల్యంపై భవిత కేంద్రం సిబ్బంది, హెచ్ఎం సుజాత తో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. సమాజంలో ఆటిజం వైకల్యంతో ఇబ్బందులు పడుతున్న పిల్లలను తల్లిదండ్రులు గుర్తించి భవిత కేంద్రంలో చేర్పించాలన్నారు. ఇటువంటి వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారిని సమస్య నుంచి బయటపడడానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రత్యేక ప్రతిభావంతులను క్షేత్రస్థాయిలో తల్లిదండ్రులు, ఎంఆర్సీ సిబ్బంది, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది గుర్తించి భవిత కేంద్రానికి చేర్చాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఆర్‌సీ సిబ్బంది, భవిత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల దాహం తీర్చడానికే నీటి తొట్టెలు



భూమి పూజ చేస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం

నిమ్మనపల్లె: పశువులు మేకలు గొర్రెల దాహార్తి తీర్చేందుకు గ్రామాల్లో నీటి తొట్టెల నిర్మాణం ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్నట్లు డ్వామా పీడీ వెంకటరత్నం తెలిపారు. బుధవారం మండలంలోని కొండయ్యగారి పల్లె పంచాయతీ, వెంకోజిగారిపల్లె అంబేద్కర్ కాలనీలో ఏపీడీ శ్రీనివాసులు, ఎంపీడీఓ పరమేశ్వర్‌తో కలసి పశువుల తాగునీటి తొట్టెల నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రస్తుతం ముంచుకొస్తున్న వేసవి దృష్టిలో ఉంచుకుని నోరులేని మూగ జీవాలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్న లక్ష్యంతో ప్రభుత్వం మండలంలో 30 నీటి తొట్టెల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసిందన్నారు. ఏపీఓ రమేష్, ఏఈ మిథున్ చక్రవర్తి పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి



పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

నిమ్మనపల్లె : అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని మదనపల్లి రూరల్ సర్కిల్ సీఐ సత్యనారాయణ సూచించారు. బుధవారం నిమ్మనపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్ఐ తిప్పేస్వామితో కలిసి పోలీసు సిబ్బంది, మహిళా సంరక్షణ కార్యదర్శులతో, పోలీస్ సిబ్బందితో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్నారు. పల్లెల్లో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ వాటిని తక్షణం పరిష్కరించడానికి ప్రయత్నించాలన్నారు. వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్ వైర్ల చోరీలపై ప్రత్యేక నిఘా ఉంచాలని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో పోలీసులు గస్తీలు పెంచాలన్నారు. మండలంలోని ప్రతి రోడ్డు మార్గంలోను, దుకాణాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించాలన్నారు. రౌడీ షీటర్లు, గంజాయి స్మగ్లింగ్, అక్రమ మద్యం వ్యాపారాన్ని అరికట్టేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి



చలపతిరావు దంపతులను సన్మానిస్తున్న అధికారులు

నిమ్మనపల్లె : విధుల్లో చేరిన నాటి నుంచి అహర్నిశలు కృషి చేసే ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పనిసరని డీఎల్‌డీఓ జిల్లా గ్రామ సచివాలయాల ఇన్‌చార్జి లక్ష్మీపతి అన్నారు. బుధవారం స్థానిక టీఎస్ఆర్ కల్యాణ మండపంలో ఈఓపీఆర్‌డీ చలపతిరావు పదవీ విరమణ సన్మాన కార్యక్రమం జరిగింది. లక్ష్మీపతి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి ఆత్మ సంతృప్తితో పదవీ విరమణ చేయాలని పేర్కొన్నారు. చలపతిరావు 1989 జూలైలో వీడీఓగా బాధ్యతలు చేపట్టి, 2002లో పంచాయతీ కార్యదర్శి, 2006లో ఈఓపీఆర్‌డీ పదోన్నతి పొందారన్నారు. ఆయన 36 సంవత్సరాల పదవీకాలంలో కురబలకోట, మదనపల్లె, చిత్తూరు, రామసముద్రం, నిమ్మనపల్లె మండలాల్లో పనిచేశారన్నారు. ఈ సందర్భంగా చలపతిరావు, లలితకుమారి దంపతులను ఘనంగా సన్మానించారు. చలపతిరావు మాట్లాడుతూ ప్రజలకు మనం చేసిన మంచిని వారు గుర్తించినప్పుడే, ఉద్యోగులుగా మనకు సంతృప్తిని పొందగలమన్నారు. ప్రతి ఉద్యోగి ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంతంగా, ప్రజలతో, అధికారులతో, స్నేహభావంతో మెలిగినప్పుడే ఉద్యోగ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించగలమని తెలిపారు. డీఎల్‌డీఓ నాగరాజ, డ్వామా ఏపీడీ శ్రీనివాసులు, ఎంపీడీఓలు పరమేశ్వర్ రెడ్డి, లీలా మాధవి, గంగయ్య, టీడీపీ వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచులు పాల్గొన్నారు.

స్వచ్ఛతే లక్ష్యంగా పనిచేయాలి



తడిచెత్త-పొడిచెత్తను వేరుచేసే విధానాన్ని వివరిస్తున్న ఎంపీడీఓ

కలకడ : పంచాయతీలోని గ్రీన్ అంబాసిడర్‌లు, పారిశుద్ధ్య కార్మికులు స్వచ్ఛతే లక్ష్యంగా పనిచేయాలి ఎంపీడీఓ అబ్దుల్ రహీం ఆదేశించారు. బుధవారం మండలంలోని కలకడ చెత్త సేకరణ కేంద్రం వద్ద మండలంలోని అన్ని పంచాయతీల కార్మికులకు తడి చెత్త-పొడి చెత్త సేకరణ నిల్వ సామర్థ్యంపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎంపీడీఓ చెత్త సేకరణ లక్ష్యం, వినియోగం, పరిశుభ్రత పై తీసుకోవాల్సిన చర్యలను తెలియజేశారు. ఇంటింటికి చెత్త సేకరణ కార్యక్రమం పూర్తి స్థాయిలో చేపట్టినప్పుడే చెత్త నుంచి సంపద సృష్టి సాధ్యమౌతుందని గుర్తు చేశారు. చెత్త సేకరణ కేంద్రంలో సేంద్రియ ఎరువు తయారు అవుతుందని, అది రైతులకు విక్రయించడం ద్వార నాణ్యమైన సేంద్రియ ఎరువును రైతులు వినియోగించుకుంటారని తెలిపారు. తద్వార పంచాయతీకి ఆధాయం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఫ్యారీజాన్, యూఓపీఆర్‌డి మహమ్మద్ రియాజ్ ఉద్దీన్, పంచాయతీ కార్యదర్శి దేవేంద్ర, క్లాప్ మిత్రులు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక.. ఆత్మీయ పలకరింపు

పీలేరు రూరల్ : ఒకటి కాదు రెండు ఏకంగా ఐదు దశాబ్దాల తర్వాత బాల్య స్నేహితులంతా ఒకచోట కలుసుకున్నారు. గుర్తు పట్టలేని స్థితిలో ఉన్నా పరిచయం చేసుకుని బాల్య స్మృతులను నెమరువేసుకున్నారు. ఆత్మీయ ఆలింగనాలు, పలకరింపులు, ఆటపాటలతో అలరించారు. ఇందుకు స్థానిక ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్ వేదికైంది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1975 విద్యా సంవత్సరంలో పదో తరగతి అభ్యసించిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం బుధవారం ఘనంగా నిర్వహించారు. 50 ఏళ్ల తర్వాత అపూర్వ కలయికతో ఉద్విగ్నభరిత వాతావరణం నెలకొంది. నూనుగు మీసాల వయస్సులో వీడ్కోలు పలికి మలిదశ సమీస్తున్న వేళ ఒకరినొకరు చూసుకున్న వేళ వారి కళ్లవెంట ఆనందభాష్పాలు రాలాయి. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ తాము చదివిన పాఠశాలలో మెరిట్ విద్యార్థులకు ప్రతి ఏటా స్కాలర్‌షిప్పులు ఇవ్వడం జరుగుతోందని, అలాగే పాఠశాలకు మౌలిక వసతులకు చేయూతనిస్తున్నట్లు తెలిపారు. పేద విద్యార్థులకు ఆర్థిక సహాయ సహకారాలు అందించడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



పీలేరు జెడ్పీ హైస్కూల్ 1975 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు

వక్ఫ్ చట్ట సవరణ బిల్లును 'కూటమి' వ్యతిరేకించాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు రెడ్డి సాహెబ్

మదనపల్లె: ముస్లింల మనోభావాలను దెబ్బ తీసే వక్ఫ్ చట్ట సవరణ బిల్లును కూటమి ప్రభుత్వం వ్యతిరేకించాలని మదనపల్లె వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిసార్ అహ్మద్ డిమాండ్ చేశారు. లోక్‌సభలో వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై బుధవారం చర్చ జరిగిన సందర్భంగా, స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలకు అండగా ఉంటామని చెప్పిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు మద్దతు ఇచ్చి మాట తప్పారని విమర్శించారు. ముస్లింలకు అన్యాయం చేసే బిల్లుకు మద్దతు ఇస్తే ముస్లిం సమాజ ద్రోహులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. వక్ఫ్ సవరణ చట్టం 2024 బిల్లును లోక్‌సభలో ప్రవేశపెడుతున్న సమయంలో ఎన్‌డీఏలో భాగస్వామ్యులైన వివిధ పార్టీల నాయకులు అవాస్తవాలు ప్రచారం చేస్తూ వక్ఫ్ చట్టాన్ని వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. వక్ఫ్ చట్టంలో ఎవరైనా తమ ఆస్తులను తమ ఇష్టపూర్వకంగా అల్లా పేరిట, ముస్లింల సంక్షేమం కొరకు వక్ఫ్ సంస్థకు దానంగా ఇచ్చిన తరువాత తిరిగి వాటిని తీసుకునే హక్కు ఉండదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల్లో అవగాహన కల్పించి, చర్చించి ప్రజా ఆమోదం మేరకు వక్ఫ్ సవరణ చట్టం ప్రవేశపెట్టాలన్నారు. టీడీపీ వక్ఫ్ సవరణ చట్టం 2024ను పార్లమెంటు, రాజ్యసభలో వ్యతిరేకించి ముస్లింలకు న్యాయం చేయాలని లేని పక్షంలో ముస్లింల తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జబీబుల్లా, షాజహాన్,యాసిన్, అబ్దుల్లా, నూర్ మొహిద్దీన్ ఖాన్, చాను, తాజ్,సాదిక్, బస్రి, వినుత పాల్గొన్నారు.

ముస్లింలను మోసం చేయడమే లక్ష్యం

వక్ఫ్ బిల్లుకు టీడీపీ, జనసేన పార్టీలు మద్దతు ఇవ్వడం ముస్లిం సమాజానికి ద్రోహం చేసినట్టే అవుతుందని మదనపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు రెడ్డి సాహెబ్ అన్నారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు సిఎం చంద్రబాబు ముస్లింలకు ఇచ్చిన హామీ మేరకు వక్ఫ్ ఆస్తుల రక్షణ కొరకు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న వక్ఫ్ బిల్లును వ్యతిరేకించాలని ముస్లిం సమాజం కోరుతోందన్నారు. టీడీపీ, జనసేన పార్టీలు వక్ఫ్ సవరణ చట్టం 2024ను పార్లమెంటు, రాజ్యసభలో వక్ఫ్ బిల్లును వ్యతిరేకించాలని ముస్లింలకు న్యాయం చేయాలని లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ ఎస్‌కే.బాషా, మహమ్మద్ పీర్ తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛను హరించడానికే వక్ఫ్ సవరణ బిల్లు

పీలేరు : రాజ్యాంగ స్వేచ్ఛను హరించడానికే కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లు తీసుకొచ్చిందని ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దెల అమృతతేజ అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలు తీవ్రంగా నిరసనలు వ్యక్తం చేస్తున్నప్పటికీ వాటిని పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుకు టీడీపీ, జనసేన పార్టీలు మద్ధతు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ముస్లింల పక్షపాతిగా ఉంటానని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వచ్చాక పట్టించుకోకుండా కేంద్ర ప్రభుత్వ బిల్లుకు మద్ధతివ్వడం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు.